సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 14 । జూన్ । 2024



ఆపద్బాంధవులు
జిల్లాలో రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో వేల యూనిట్ల రక్తం సేకరించి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు.
- 8లో ▸



ఆశ వర్కర్ల ధర్నా
ఆశ వర్కర్లకు పరీక్ష పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.8 /22.9
ఆకాశం మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీస్తాయి. అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

సివిల్స్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి
కామారెడ్డి క్రైం: సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు, ఇంటర్వ్యూ (2025) కోసం సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను ఆబ్జెక్టివ్ టైప్, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకూడదని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6281766534 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఈదురు గాలుల బీభత్సం


ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. వెల్లుట్లలో నక్క సాయిలు, విఠలేశ్వరాలయం, సాయిబాబాకు చెందిన రేకుల షెడ్లు గాలికి ఎగిరిపోయాయి. వెంకటాపూర్‌లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

1.86 క్వింటాళ్ల గంజాయి సీజ్


కొత్తగూడెంటౌన్: కారులో అక్రమంగా తరలిస్తున్న రూ. 75 లక్షల విలువైన 1.86 క్వింటాళ్ల గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. స్థానిక ఎస్సై విజయ, సిబ్బందితో కలిసి గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ అండర్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కారులో వస్తున్న ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడమే కాక పోలీసులను గమనించి పారిపోయేందుకు యత్నించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా కామారెడ్డి జిల్లాకు చెందిన పెను గొండ నర్సింలు, కుంచం లక్ష్మణ్, భూక్యా లక్ష్మణ్‌గా గుర్తించారు. వీరు ఒడిశాలోని మల్కన్‌గిరిలో 1.86 క్వింటాళ్ల గంజాయి కొనుగోలు చేసి కారులో భద్రాచలం మీదుగా మహారాష్ట్రలోని షోలాపూర్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. గంజాయి, కారును స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

మహిళా సంఘాల పనితీరు భేష్


దోమకొండ: జిల్లాలో స్వయం సహాయక సంఘాల పనితీరు బాగుందని అస్సాం రాష్ట్ర ప్రతినిధుల బృందం సభ్యులు కితాబునిచ్చారు. మండలంలోని సంఘమేశ్వర్‌లో జోగిని రేణుక సాగు చేస్తున్న డ్రాగన్‌ఫ్రూట్ పంటను గురువారం వారు పరిశీలించారు. ఇలాంటి పంటలకు ఐకేపీ ఆధ్వర్యంలో ఆర్థిక సహకారం అందించడాన్ని అభినందించారు. మహిళలు బ్యాంకు రుణాల ద్వారా ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని, కుటుంబ పోషణలో ముందుంటారన్నారు. డీపీఎం సుధాకర్, ఏపీఎం రాజు, బృందం సభ్యులు సురేష్‌కుమార్ ఉన్నారు.

సీఎంను కలిసిన జిల్లా నేతలు


సాక్షి, కామారెడ్డి: నియోజకవర్గాల అభివృద్ధికి కావలసిన నిధుల కోసం జిల్లాకు చెందిన పలువురు నేతలు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సీఎం నివాసంలో కలిసి నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించారు. అలాగే ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు అదనంగా నిధులు ఇవ్వాలని కోరారు.



తనువు చాలిస్తున్నారు..



- రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామానికి చెందిన సిద్ధం శివప్రసాద్ (25) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యానికి గురైన తండ్రి వైద్యం కోసం చేసిన అప్పులు తీర్చలేక ఈ నెల 3న గడ్డి మందు తాగాడు. వైద్యం కోసం కామారెడ్డికి అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 7న చనిపోయాడు.



- నాగిరెడ్డిపేట మండలం ఎర్రకుంట తండాకు చెందిన మలావత్ కేవుల (36) భూమి పట్టా విషయంలో మనస్తాపం చెంది ఈ నెల 2న పురుగుల మందు తాగి ఆస్పత్రి పాలయ్యాడు. చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు.



- రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన ఒంటరి నవీన్ (23) ఇంట్లో ఉరి వేసుకున్నాడు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న నవీన్ తల్లి చనిపోయిన బాధ నుంచి కోలుకోలేకపోయాడు. తల్లిని గుర్తు చేసుకుంటూ బాధపడుతుండేవాడని, తండ్రి పొలం దగ్గరకు వెళ్లగానే ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

- అప్పులు, అనారోగ్యం, కుటుంబ కలహాలతో అర్ధంతరంగా జీవితం ముగింపు
- క్షణికావేశంలో నిర్ణయాలు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- ఆత్మహత్యల కట్టడికి చర్యలు అవసరం



సాక్షి, కామారెడ్డి : ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు, మానసిక ఒత్తిళ్లు.. ఇలా వివిధ కారణాలతో తనువు చాలించే వారి సంఖ్య పెరుగుతుంది. తనకు ఎదురైన సమస్యకు పరిష్కారం వెతకలేక ఉరితాడును వెతికేవారు కొందరైతే, చిన్న కష్టాన్ని కూడా తట్టుకోలేక పురుగుల మందు తాగేవారు మరి కొందరు.

క్షణికావేశంలో వారు తమ జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తున్నారు. సమస్య చిన్నదైనా, పెద్దదైనా ప్రతీ దానికీ పరిష్కారం దొరుకుతుందని తెలిసినా మానసిక స్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఫలితంగా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. జిల్లాలో రోజూ ఏదో ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో సూసైడ్ కేసులు నమోదు అవుతునే ఉన్నాయి. జిల్లాలో 2022లో 416 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 2023లో 386 మంది, ఈ ఏడాది ఇప్పటి వరకు 158 మంది బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

ఆర్థిక సమస్యలే ప్రధాన కారణం!

ఆత్మహత్యలకు ఆర్థిక సమస్యలే ప్రధాన కారణమవుతున్నాయి. వ్యవసాయం అనుకూలించకపోవడం, పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇళ్లు కట్టుకునేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. పెళ్లిళ్ల విషయంలో చాలా మంది స్థాయికి మించి కట్నకానుకలు ఇవ్వడం, ఆర్భాటంగా పెళ్లిళ్లు చేయడం మూలంగా ఎక్కువ ఖర్చు చేసి అప్పులపాలవుతున్నారు. అలాగే ఇళ్లలో జరిగే చిన్న ఫంక్షన్లకు కూడా ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. ఇలా వివిధ కారణాలతో అప్పులు చేసిన వారు.. వాటిని తీర్చలేక మనోవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇదే సమయంలో ఆరోగ్య సమస్యలతో వైద్యం కోసం కూడా పెద్ద మొత్తంలో అప్పులు చేస్తున్నారు. అప్పులతో కొందరు భూములు అమ్ముకుంటున్నారు. భూమి అమ్మకానికి పెట్టినపుడు కుటుంబంలో తగాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. దీంతో కొందరు క్షణికావేశంలో ఆత్మహత్య నిర్ణయం తీసుకుంటున్నారు.

ఆ ప్రాంతంలో ఎక్కువ

జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. రామారెడ్డి మండలంలో 18 పంచాయతీలు ఉండగా, ఇందులో ఐదారు గ్రామాలు పెద్దవి. మిగతావి చిన్న గ్రామాలు, తండాలే. ఈ మండలంలో గతేడాది 19 మంది ఆత్మహత్యలకు పాల్పడగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 14 మంది చనిపోయారు. వారిలో యువకులే ఎక్కువ మంది. చిన్న చిన్న కారణాలతో తనువు చాలిస్తున్నారు. దేవునిపల్లి ఠాణా పరిధిలో గతేడాది 36 మంది ఆత్మహత్య చేసుకోగా, ఈ సారి ఇప్పటికే 17 మంది చనిపోయారు. సదాశివనగర్‌లో గతేడాది 16 మంది, ఈ సారి పది మంది సూసైడ్ చేసుకున్నారు. ఇలా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆత్మహత్యలు ఎక్కువగా జరగడం ఆందోళన కల్గించే అంశం. అధికారులు దీనిపై స్పందించాల్సిన అవసరం ఉంది. సమస్యను ఎదుర్కొనలేక ఆత్మహత్యే పరిష్కారం అన్న భావన జనంలోకి వెళ్లడం ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పోలీసు స్టేషన్ల వారీగా ఆత్మహత్యల సంఖ్య

పోలీస్ స్టేషన్	2023	2024 (ఇప్పటి వరకు)
రామారెడ్డి	19	14
సదాశివనగర్	16	10
మాచారెడ్డి	18	08
నాగిరెడ్డిపేట	18	07
దేవునిపల్లి	36	17
కామారెడ్డి	19	16
బాన్సువాడ	25	11
నస్రుల్లాబాద్	11	09
నిజాంసాగర్	10	06
భిక్కనూరు	30	07
బీర్కూర్	17	06
బీబీపేట	14	05
దోమకొండ	15	06
గాంధారి	21	03
లింగంపేట	29	07
ఎల్లారెడ్డి	15	04
తాడ్వాయి	19	07
రాజంపేట	11	01
పిట్లం	16	08
బిచ్కుంద	08	01
జుక్కల్	10	01
మద్నూర్	04	02
పెద్దకొడప్‌గల్	05	02
మొత్తం	386	158

చర్యలు తీసుకుంటాం


ఏ సమస్యకైనా ఆత్మహత్య పరిష్కారం కాదు. దీనిపై అవగాహన కోసం వైద్య, ఆరోగ్య శాఖ, పోలీసు శాఖల సమన్వయంతో కార్యక్రమాలు చేపడతాం. నెల రోజుల పాటు కార్యాచరణ రూపొందించి మానసిక వైద్యులతో అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తాం.
– జితేష్ వి పాటిల్, కలెక్టర్, కామారెడ్డి

సమస్యను అధిగమించాలి


సమస్య ఏదైనా దాన్ని అధిగమించే ప్రయత్నం చేయాలి. ఎవరైనా మానసికంగా ఇబ్బంది పడుతున్నపుడు కుటుంబ సభ్యులు ఓదార్చి, ధైర్యాన్నివ్వాలి. అవసరమైతే మానసిక వైద్యుల దగ్గరికి తీసుకువెళ్లాలి. ప్రతీ సమస్యకూ పరిష్కారం ఉంటుంది. సమస్యకు భయపడి ఆత్మహత్యకు పాల్పడితే కుటుంబాలు రోడ్డున పడుతాయన్న విషయాన్ని అర్థం చేయించాలి.
– సింధుశర్మ, జిల్లా ఎస్పీ, కామారెడ్డి

సన్నిహితులతో చర్చించాలి


నిరంతరం ఫోన్ వాడుతూ, కుటుంబ సభ్యులు, స్నేహితులతో సమయం గడపకపోవడంతో చాలా మంది ఒంటరితనం అనుభవిస్తున్నారు. తమకు ఏదైనా సమస్య ఎదురైనపుడు ఎవరికీ చెప్పుకోలేకపోతున్నారు. ఫలితంగా క్షణాల్లో నిర్ణయం తీసుకుంటున్నారు. ఎంత పెద్ద సమస్య అయినా కుటుంబ సభ్యులతో గానీ, స్నేహితులతో గానీ చర్చిస్తే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయి. దీనిపై అవగాహన కల్పిస్తాం.
– రమణ, మానసిక వైద్యుడు, కామారెడ్డి

అల్బెండజోల్ మాత్రలు వేయించాలి

- 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: నులి పురుగుల నివారణ కోసం 19 ఏళ్ల లోపు వారికి అల్బెండజోల్ మాత్రలు వేయించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఈ నెల 20 న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నులి పురుగుల బారిన పడితే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి లాంటి సమస్యలతో బాధపడతారని వివరించారు. పిల్లలు చెప్పులు లేకుండా నడవడం ద్వారా నులి పురుగులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో 19 ఏళ్లలోపు వారు 2,50,254 ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయనున్నామని తెలిపారు. రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి మూడేళ్ల పిల్లలకు ఒక మాత్రను నలిపి ఇవ్వాలన్నారు. 3 నుండి 19 ఏళ్లలోపు వారి మాత్రను చప్పరించాలని సూచించారు. ఈ మందులతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత ఈ మాత్ర వేసుకునేలా చూడాలన్నారు. ఏదైనా కారణం చేత ఈ నెల 20న మాత్రలు వేసుకోని వారికి 27న మాప్ అప్ కార్యక్రమాన్ని నిర్వహించి మాత్రలు అందిస్తామని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో కార్యక్రమాన్ని చేపట్టి వంద శాతం పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి సైతం మాత్రలు వేయించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శిరీష, డీపీవో శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, ఐసీడీఎస్ పీడీ బావయ్య, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, డీఈవో రాజు,రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ రాజన్న పాల్గొన్నారు.

అసైన్డ్ భూమికి పట్టా!

- ధరణి రికార్డులో తప్పుగా నమోదైన వైనం
- రెండు ఎకరాలు పట్టా చేసిన రెవెన్యూ అధికారులు
- ముడుపులు తీసుకొని ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు

లింగంపేట: మండలంలో రెవెన్యూ అధికారులు మామూళ్లు తీసుకొని ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అసైన్డ్ భూమికి పట్టా చేయడం మండలంలో చర్చనీయాంశమైంది. లింగంపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన లంబాడి చాంగికి ప్రభుత్వం సర్వే నంబర్ 16/పైకి3 లో రెండు ఎకరాల భూమిని అందజేసింది. సదరు భూమి 1955 కాస్రా పహణీలో సర్కారు భూమిగా నమోదై ఉంది. ధరణి పోర్టల్‌లో పట్టా భూమిగా తప్పుగా నమోదైంది. ఈ విషయం తెలిసిన రెవెన్యూ అధికారులు సదరు భూమిని సర్కార్ భూమిగా మార్చి, ప్రొహిబిటేడ్(విక్రయించడానికి వీలులేని)ల్యాండ్ లిస్టులో పెట్టాలి. కానీ అలా చేయని అధికారులు సదరు భూమిని తాజాగా మరొకరి పేరు మీద పట్టా చేశారు. చాంగి జీవనోపాధి కోసం ప్రభుత్వం ఇచ్చిన భూమిని హైదరాబాదుకు చెందిన పులిపాటి మమతకు విక్రయించింది. జూన్ 7న సదరు భూమికి తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. దీనికోసం రూ.రెండు లక్షలకు పైగా డబ్బు తీసుకున్నట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



అసైన్డ్ భూమిని పులిపాటి మమత పేరుపై పట్టా చేసిన తహసీల్దార్

'ఓఆర్‌సీ' లేకుండానే రిజిస్ట్రేషన్లు

ఇనామ్ భూములకు నిబంధనల ప్రకారం ఓఆర్‌సీ (ఆక్యూపైడ్ రైట్స్ సర్టిఫికెట్) సర్టిఫికెట్ తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాలి. కానీ లింగంపేట తహసీల్ కార్యాలయంలో మాత్రం సర్టిఫికెట్ లేకుండానే రిజిస్ట్రేషన్లు చేయడం విశేషం. ఇనామ్ భూములకు గుంటకు రూ.వెయ్యి చొప్పున లంచం తీసుకొంటూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఒకటి నుంచి ఐదు గుంటల భూమి రిజిస్ట్రేషన్ల విషయంలోనూ లంచాలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఆఫీసులోని ఓ ఆపరేటర్ ద్వారా భూములు అమ్మే వారు, కొనే వారితో సంప్రదింపులు జరిపి లంచాలు తీసుకుంటున్నట్లు తెలిసింది. డబ్బు ఇవ్వని వారిని కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మరోవైపు తహసీల్దార్ చేస్తున్న పనులకు అడ్డు వచ్చే వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. కార్యాలయానికి పని నిమిత్తం వచ్చే వారికి కనీస మర్యాద ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

పట్టా రద్దు చేస్తాం

రాంపూర్‌లోని సర్వే నంబర్ 16/పైకి3లోని భూమి అసైన్‌మెంట్‌గా నమోదు కాలేదు. పట్టా చేసిన తర్వాత ఆ విషయం తెలిసింది. దీనిపై కొన్న వారికి, అమ్మిన వారికి సమాచారం ఇచ్చాం. స్లాట్ బుక్ కావడంతో రిజిస్ట్రేషన్ చేశాం. ఆ పట్టాను రద్దు చేస్తాం.
– నరేందర్, తహసీల్దార్

మత సామరస్యానికి ప్రతీక కామారెడ్డి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎస్పీ సింధుశర్మ, అధికారులు

కామారెడ్డి క్రైం: జిల్లా మత సామరస్యానికి ప్రతీకగా ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బక్రీద్ నేపథ్యంలో కలెక్టరేట్‌లో గురువారం శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17న బక్రీద్ సందర్భంగా ప్రార్థనా స్థలాలు, వధశాలల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నిబంధలు లోబడి పశువుల రవాణా జరిగేలా చూడాలన్నారు. అక్రమంగా పశువులను తరలిస్తున్నట్లు దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు నిరంతరం నిఘా ఉంచాలన్నారు. నిబంధలు విరుద్ధంగా వాహనాలలో పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పశు వైద్యాధికారులు ధ్రువీకరించిన వాటినే నిర్ధారించిన ప్రాంతాలలో వధించాలని సూచించారు. ముస్లింలు పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండగకు విద్యుత్ అంతరం లేకుండా చూడాలన్నారు.

వాహనాలను అడ్డగించొద్దు

పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి ఐదు చెక్‌పోస్టుల వద్ద నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ సింధుశర్మ తెలిపారు. పశువుల అక్రమ రవాణాపై తనిఖీలు చేయాలన్నారు. అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అంతేగానీ వాహనాలను అడ్డగించొద్దని సంఘాలు, యువకులకు సూచించారు. సంతల వద్దే పశువులను పరిశీలించి సర్టిఫికెట్ ఇవ్వాలని పశువైద్యాధికారులకు సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎస్పీ నరసింహారెడ్డి, ఆర్డీవోలు రంగనాథ రావు, రమేశ్‌రాథోడ్, జిల్లా పశు సంవర్ధక అధికారి సింహారావు, డీపీవో శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్ పాల్గొన్నారు.

ఫాంపాండ్‌లతో భూగర్భ జలాల పెంపు

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి రూరల్: వ్యవసాయ క్షేత్రాల్లో ఫాంపాండ్ గుంతలు నిర్మించుకోవడంతో భూగర్భ జలాలు పెరుగుతాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కామారెడ్డి మండలం కొటాల్‌పల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో నిర్మిస్తున్న ఫాంపాండ్ పనులను ఆయన పరిశీలించారు. ఆయన గడ్డపార చేతబట్టి తవ్వుతూ కూలీలను ఉత్సాహపరిచారు. రైతులు పొలాల్లో ఫాంపాండ్స్ తవ్వుకోవడంతో కూలీలకు ఉపాధి లభిస్తుందన్నారు. అలాగే భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. ఈ కుంటల్లో చేపపిల్లలు కూడా పెంచుకోవచ్చన్నారు. ఫాంపాండ్ నిర్మించుకోవడానికి ముందుకువచ్చే రైతులకు సబ్సిడీతో పాటు సాంకేతిక సలహాలు అందిస్తామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవర్ధన్, ఏపీవో నరేందర్, కార్యదర్శి గంగుబాయి, ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ ఉన్నారు.


కొటాల్‌పల్లిలో ఫాంపాండ్ గుంత తవ్వుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఆపదలో ఆపద్బాంధవులు

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



కామారెడ్డి అర్బన్: అన్ని దానాల్లో కన్నా రక్తదానం చాలా గొప్పది. సకాలంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మనం చేసే రక్తదానం మరొకరి ప్రాణాలు కాపాడుతుంది. ప్రమాదాల్లో చనిపోతున్న వారు కొందరైతే, తీవ్రగాయాలతో ఆస్పత్రుల్లో చేరి రక్తం అందక చనిపోయే వారు చాలా మంది ఉన్నారు. బాధితుల బాధలు, ఇబ్బందులు కళ్లారా చూసిన యువకులు, దాతలు పెద్ద ఎత్తున రక్తదానం చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పలువురు రక్తదానం చేస్తున్న వారిపై కథనం.

73 సార్లు రక్తదానం

రక్తం అవసరమై చావుబతుకుల్లో ఉన్న వారి ప్రాణాలను కాపాడితే అంతకన్న గొప్ప సమాజసేవ ఏముంటుందని కామారెడ్డికి చెందిన బాలు అంటున్నారు. ఇప్పటి వరకు 73 సార్లు రక్తదానం చేశారు. పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ సాధించారు. సమాజ వైద్యుడిగా 2007లో కామారెడ్డి రక్తదాతల సమూహం ఏర్పాటు చేసి నాటి నుంచి నేటికి 20వేల మందికి ప్రాణదాతగా నిలిచారు. రక్తదాతల సమూహంతో పాటు ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్తగా, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సేవాదళ్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా వివిధ ప్రాంతాల్లో మోగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు.



బాలును సన్మానిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

వివిధ గ్రూప్‌ల రక్తం అవసరమైనప్పుడు దాతల సమూహంలో విషయం తెలియజేయగానే రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి రక్తం ఇవ్వడానికి మూడు వేల మంది దాతల్లో ఎవరో ఒకరు సిద్ధంగా ఉంటున్నారు. రక్తదానంలో బాలు కృషిని గుర్తించిన దేశంలోని పలు సంస్థలు, ప్రభుత్వాలు, వ్యక్తులు చేసిన సన్మానాలు, అభినందనలు, నగదు పురస్కారాలు అందుకున్నారు.

ఏడాదిలో 2,306 యూనిట్ల రక్తం సేకరణ

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు సకాలంలో రక్తాన్ని అందజేసే ఉద్దేశంతో ఐవీఎఫ్, రెడ్‌క్రాస్, కామారెడ్డి రక్తదాతల సమూహం సహకారంతో పలు మోగా శిబిరాలు నిర్వహించి ఏడాది కాలంలో 2306 యూనిట్ల రక్తం సేకరించి ఇచ్చారు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తాను చేసిన కృషిని నమోదు చేసుకుందని ఆయన పేర్కొన్నారు.

ఎంతో సంతృప్తినిస్తోంది



డాక్టర్ పుట్ట అనిల్‌కుమార్ | జమీల్ హైమద్ | వెంకట రమణ

రక్తదానం చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తోందని, పైగా ఆరోగ్యం, ఆనందం కలుగుతోందని పలువురు రక్తదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మూడు నెలలకు రక్తం చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చు. రక్తదాతల సమూహంలోని పోలీసు శాఖలో ఉద్యోగం చేసే డాక్టర్ పుట్ట అనిల్‌కుమార్ ఇప్పటికి 24 సార్లు రక్తదానం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు జమీల్ హైమద్ 26 సార్లు, వెంకటరమణ 22 సార్లు రక్తదానం చేశారు.

డాక్టర్ బాలుకు అవార్డు



కామారెడ్డి అర్బన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలుకు ఆహ్వానం అందింది. 73 సార్లు రక్తదానం చేయడంతో పాటు తలసేమియా చిన్నారుల కోసం ఏడాది కాలంలో 2,306 యూనిట్ల రక్తాన్ని సేకరించినందుకు ప్రత్యేక అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం రాజ్‌భవన్‌లో జరగనున్న కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు.

క్లుప్తంగా

లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను పెద్దకొడప్‌గల్ మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీకి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లింగాయత్ నాయకులు మల్లప్ప పటేల్ మాట్లాడుతూ లింగాయత్‌లను ఓబీసీలలో చేర్చి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో లింగాయత్ నాయకులు మల్లప్ప పటేల్, సంతోష్ పటేల్, ఆకాశ్ పటేల్, పవన్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పారిశుధ్య పనులు



బాన్సువాడ రూరల్ : వర్షాకాలాన్ని పురస్కరించుకుని బాన్సువాడ పట్టణంలో మురుగునీరు రోడ్లపై రాకుండా ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ తెలిపారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఇరువైపులా డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తున్నారు. వ్యాపారస్తులు చెత్తాచెదారాన్ని నేరుగా డ్రెయినేజీల్లో వేయరాదన్నారు. మున్సిపల్ సిబ్బంది వారి ప్రత్యేక వాహనాల్లో చెత్తాచెదారం సేకరిస్తున్నారని, వారికి సహకరించాలన్నారు.ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు

సాక్షి ఎఫెక్ట్..

మాచారెడ్డి : 'పడకేసిన పారిశుధ్యం' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి గురువారం గజ్యానాయక్ తండా పంచాయతీ కార్యదర్శి రిజ్వానా బేగం స్పందించారు. డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పైఅధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. సిబ్బందితో చౌరస్తాలోని కామారెడ్డి సిరిసిల్ల రహదారి పక్కనున్న డ్రెయినేజీ స్థలాన్ని పరిశీలించారు. అలాగే పలు గ్రామాల్లో పారిశుధ్యపనులను ముమ్మరం చేశారు.

ఆటోకార్మికుల ఔదార్యం..



మాచారెడ్డి : తోటి ఆటోవాలా అనారోగ్యంతో మృతి చెందాడు. మిగిలిన ఆటోవాలాలు ఆ కుటుంబానికి మేమున్నామని భరోసానిస్తూ.. గురువారం రు 20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండలంలోని చంద్రునాయక్ తండాకు చెందిన పరశురాములు అనే ఆటోవాలా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు ఆటో వాలాల సంఘం సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేసి భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు పీ.రవి, సభ్యులు స్వామి గౌడ్, లకావత్ రవి, లింగం ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశవర్కర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్ : ఆశ వర్కర్లకు నష్టం కలిగించే పరీక్ష విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేకర్ డిమాండ్ చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి చంద్రశేఖర్ మాట్లాడుతూ చాలా ఏళ్లుగా వైద్య శాఖలో ఎన్నో సేవలు అందిస్తున్న ఆశలకు మళ్లీ నూతనంగా ఆశల జ్ఞాపకశక్తి నిరూపించుకునేందుకు పరీక్ష నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఆశలు ఈ పరీక్షలో ఉత్తీర్ణులైతే రూ. 5000 వేతనం పెంచుతామని ప్రభుత్వ సర్క్యులర్‌లో ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుంటే తమ పోరాటాల వల్ల ప్రభుత్వం వెనక్కి తగ్గిందని గుర్తు చేశారు. ఆశలకు కనీస వేతనంలో పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, పనిభారం తగ్గింపు తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ధర్నా చేస్తున్న ఆశలతో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో చంద్రశేకర్ మాట్లాడారు. ఆశల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు రాజనర్సు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఇందిరా, ప్రధాన కార్యదర్శి రాజశ్రీ, నాయకులు పల్లవి, విజయ, పద్మ, లావణ్య, ప్రవీల, చంద్రిక, లతా, అనిత, కృష్ణవేణి, శోభ, మంజుల, స్వరూప పాల్గొన్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

- మల్టీపుల్ ఆర్గాన్ ఇన్ఫెక్షన్ బారినపడిన తల్లి
- అమ్మను కాపాడుకునేందుకు తల్లడిల్లుతున్న కొడుకు



ఆస్పత్రిలో మాడబోయి భోజమ్మ

నందిపేట్(ఆర్మూర్): పని చేస్తేనే పూట గడవని స్థితిలో ఉన్న కుటుంబానికి పెద్ద ఆపదొచ్చింది. మల్టీపుల్ ఆర్గాన్స్ ఇన్ఫెక్షన్ బారినపడి చావుబతుకుల మధ్య ఉన్న తల్లిని కాపాడుకునేందుకు కొడుకు తల్లడిల్లుతున్నాడు. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్న ఆయన తల్లిని కాపాడుకునేందుకు తాహతుకు మించి అప్పులు చేశాడు. నందిపేట మండల కేంద్రానికి చెందిన మాడబోయి భోజమ్మ కొన్ని రోజులక్రితం ఉన్నట్టుండి పడిపోగా కుమారుడు గణేశ్ స్థానిక వైద్యుల వద్దకు తీసుకెళ్లాడు. వారి సూచన మేరకు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. భోజమ్మ మల్టీపుల్ ఆర్గాన్ ఇన్ఫెక్షన్ బారినపడిందని అక్కడి వైద్యులు నిర్ధారించారు. రెండేళ్ల వయస్సులోనే తండ్రిని కోల్పోయిన గణేశ్.. తల్లిని ఎలాగైనా కాపాడుకోవాలని ఇప్పటి వర కు సుమారు రూ. 3.50 లక్షలు అప్పు చేసి ఆస్పత్రి బిల్లులు చెల్లించాడు. ప్రస్తు తం చేతిలో డబ్బులు లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని నిర్ణయించగా, సదరు ప్రైవేట్ ఆస్పత్రి వారు మరో రూ.లక్ష చెల్లిస్తే డిశ్చార్జి చేస్తామని చెప్పారు. దీంతో గణేశ్ (96768 22808) తన తల్లిని కాపాడే ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని వేడుకుంటున్నాడు.

తెలుగు పుస్తకాలు వెనక్కి..

- 'ముందుమాట'లో తొలి సీఎం కేసీఆర్, నాటి మంత్రుల ప్రస్తావన
- లక్షా 80వేల పుస్తకాలను తిరిగి పంపిస్తున్న విద్యాశాఖ

నిజామాబాద్‌అర్బన్: తెలుగు పాఠ్యపుస్తకాల్లోని 'ముందుమాట'లో మాజీ సీఎం కేసీఆర్, నాటి మంత్రులు, అధికారుల ప్రస్తావన ఉండడంపై ఫిర్యాదులు అందడంతో వాటిని వెనక్కి పంపించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం సరఫరా చేసిన తెలుగు పుస్తకాలను జిల్లా అధికారులు గురువారం నుంచి వెనక్కి తెప్పించుకుంటున్నారు. జిల్లాలో 6 లక్షల 17 వేల 879 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, నేటి వరకు 5లక్షల 80 వేల 342 పుస్తకాలు పంపిణీ చేశారు. ఇందులో లక్షా 80వేల తెలుగు పాఠ్యపుస్తకాలున్నాయి. వాటన్నింటినీ వెనక్కి తీసుకొని మళ్లీ ముద్రించి సరఫరా చేయనున్నట్లు తెలిసింది. జిల్లాలో 693 ప్రాథమిక, 116 ప్రాథమికోన్నత, 260 ఉన్నత, ప్రభుత్వ ఆధీన పాఠశాలలు 112, కేజీబీవీలు 25, మోడల్ స్కూళ్లు 10 ఉన్నాయి. 468 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా అన్ని రకాల పాఠశాలల్లో కలిపి 2,87,820 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు మొదటి లాంగ్వేజ్‌గా తెలుగు సబ్జెక్టును తీసుకుంటారు. వీరందరికీ తెలుగు పాఠ్య పుస్తకాలు తప్పనిసరి.

తెలుగు బోధనకు ఆటంకమే

పాఠ్యపుస్తకాలను వెనక్కి పంపిస్తే తెలుగు బోధనకు ఆటంకం ఏర్పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. పాఠశాలలు ప్రారంభమైన తరువాత పుస్తకాలను వెనక్కి తీసుకుంటే అన్ని తరగతుల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని అంటున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆదేశాలు వచ్చాయి

తెలుగు మీడియానికి సంబంధించిన తెలుగు పాఠ్యపుస్తకాలను వెనక్కి పంపించాలని ఆదేశాలు వచ్చాయి. వాటన్నింటిని తిరిగి పంపుతున్నాం. మళ్లీ కొత్త పాఠ్యపుస్తకాలు వస్తాయి. అప్పటి వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తెలుగు బోధన చేపడుతాం. కొత్త పుస్తకాలు రాగానే పంపిణీ చేస్తాం.

– దుర్గాప్రసాద్, డీఈవో

ఏసీజీఈ, డీసీఈబీలకు సన్మానం



కామారెడ్డి టౌన్ : విద్యాశాఖలో నూతనంగా నియమితులైన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ (ఏసీజీఈ) బలరాంను, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి(డీసీఈబీ) నీల లింగంలను విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. డీఈవో ఎస్ రాజు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రామస్వామి, జోసఫ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్, గెజిటెడ్ హెచ్‌ఎం సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, శ్రీనివాస్, నాగభూషణం, హన్మాండ్లు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



మాచారెడ్డి: మండలంలోని గిరిజన తండాలపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. మండలంలోని సిక్కులోని లొద్ది తండాలో ఇద్దరు, గుడి తండాలో ఒకరి వద్ద సారా దొరకడంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడిలో డీటీఎఫ్ సుందల్ సింగ్, ఎస్సై విక్రమ్, సిబ్బంది బాల్‌రెడ్డి, మైసరాజు, శ్రీకాంత్ రెడ్డి, నవీన్ రెడ్డి, ఆంజనేయులు, శ్రీరాగ, అపూర్వ ఉన్నారు.

ఊపిరి పీల్చుకున్న తెలుగు రాష్ట్రాలు..

- కువైట్ అగ్ని ప్రమాదంలో 49 మంది మృత్యువాత
- తెలంగాణ, ఏపీ కార్మికులు లేకపోవడంతో ఊరట

మోర్తాడ్(బాల్కొండ): ప్రపంచంలో అత్యధికంగా చమురు ఉత్పత్తి చేసే కువైట్ దేశంలోని మంగాఫ్ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకున్న ఘోర అగ్ని ప్రమాదంలో భారతీయ వలస కార్మికులే అత్యధిక మంది మృత్యువాత పడ్డారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు ఎవరూ ఈ ప్రాంతంలో లేకపోవడంతో తెలంగాణ, ఏపీ నుంచి వెళ్లిన కార్మికుల కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. కువైట్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించిందని వార్తలు వెలువడడంతో తమ కుటుంబీకుల క్షేమ సమాచారం తెలుసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ప్రమాదంలో 49 మంది మరణించినట్లు కువైట్ ప్రభుత్వం నిర్ధారించింది. ఇందులో 47 మంది భారతీయ వలస కార్మికులే కావడం తీవ్ర విచారకరం. ఉత్తర్ ప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన 47 మంది వలస కార్మికులతో పాటు ఫిలిప్పిన్స్‌కు చెందిన మరో ఇద్దరు కార్మికులు ఉన్నారు. కువైట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు దాదాపు 3 లక్షల మంది ఉన్నా.. మంగాఫ్ ప్రాంతంలోని లేబర్ క్యాంపులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వారు లేరు. ఎన్‌బీటీసీ అనే కంపెనీ భవన నిర్మాణ రంగం పనులు నిర్వహిస్తోంది. ఈ కంపెనీలో పని చేయడానికి వలస కార్మికులు కొంత కాలంగా మంగాఫ్ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. కార్మికుల కోసం మెస్‌లో వంట చేస్తుండగా సిలిండర్ పేలడంతో ప్రమాదం సంభవించింది.

సేఫ్టీ చర్యలు లేకపోవడమే కారణమా?

అపార్ట్‌మెంట్‌లో వలస కార్మికులకు ఎన్‌బీటీసీ కంపెనీ క్యాంపును ఏర్పాటు చేసింది. ఈ భవనం నిర్మించిన వ్యక్తి సరైన రక్షణ చర్యలు తీసుకోక పోవడంతో అగ్ని ప్రమాదం తీవ్ర రూపం దాల్చిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అపార్ట్‌మెంట్‌కు సరైన రక్షణ చర్యలు తీసుకోక పోవడంతో సిలిండర్ పేలిన ధాటికి ఇతర గదుల్లో ఉన్న సామాగ్రి చిందరవందర కావడం, మంటలు వేగంగా ఇతర గదులకు తగలడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. గల్ఫ్ దేశాల్లో వలస కార్మికుల సంరక్షణకు పక్కాగా సేఫ్టీ చర్యలు అమలు చేస్తున్నారు. కాగా ప్రమాదంలో తెలంగాణ, ఏపీలకు చెందిన వారు ఎవరు లేకపోవడంతో ఊరటనిచ్చినట్లు అయ్యిందని అక్కడ ఉద్యోగాలు చేస్తున్న మార్క ప్రమోద్‌కుమార్, గన్నారపు విసడమ్‌లు 'సాక్షి'కి వెల్లడించారు. హన్మకొండ, జగిత్యాల్ జిల్లాలకు చెందిన వీరు కొన్నేళ్లుగా కువైట్‌లోనే ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డారు. ప్రమాదంలో చిక్కుకున్న వారికి సహాయక చర్యలు అందుతున్నాయని మృతదేహాలను మార్చురీలలో భద్రపరిచారని వెల్లడించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. కామారెడ్డి, భిక్కనూరు, నిజామాబాద్ మండల కేంద్రాల్లో ఒక్కొక్కరు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

కామారెడ్డి క్రైం: కూలీ పనులు చేస్తుండగా ఓ మహిళ పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎనుగుర్తి పుష్పవ్వ (45) తోటి కూలీలతో కలిసి అదే గ్రామానికి చెందిన మరో రైతు పొలానికి కూలీ పనికి వెళ్లింది. సాయంత్రం పొలం పనులు ముగిసే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిశాయి. పనులు చేస్తుండగానే ఆమెపై నేరుగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని పట్టుబట్టారు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని సముదాయించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారులు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..



నర్సింలు (ఫైల్)

భిక్కనూరు: చెరువులో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆకుల నర్సింలు(56) బుధవారం సాయంత్రం చేపలు పట్టేందుకు స్థానిక బొబ్బిలి చెరువుకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఉదయం పలు చోట్ల గాలించారు. చెరువు వద్ద చెప్పులు కనిపించడంతో ఈతగాళ్ల సాయంతో చెరువులో వెతుకగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ..



నిజామాబాద్ రూరల్: మండలంలోని ఆకుల కొండూర్ శివారులో గుర్తుతెలియ ని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆకుల కొండూర్ శివారులో బుధవారం రాత్రి టీవీఎల్ ఎక్సెల్‌పై జన్నెపల్లి వైపు వెళ్తుండగా రైస్‌మిల్ ఎదురుగా అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్నట్లు తెలిపారు. మృతుడి, వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 59849 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జింకపై కుక్కల దాడి



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని భద్రాల్ తండా శివారులో గురువారం జింక పిల్లపై కుక్కలు దాడి చేశాయి. కుక్కలు జింకను వెంటాడుతుండగా యువకులు, రైతులు గమనించి వాటిని తరిమివేశారు. గాయపడ్డ జింకను గ్రామంలోని వెటర్నరీ అధికారులకు యువకులు సమాచారం అందించడంతో ప్రథమ చికిత్స చేశారు. ఫారెస్టు అధికారులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

డిచ్‌పల్లి: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొత్తబాది తండాకు చెందిన పవార్ లలిత (30) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి మండలం గండితండాకు చెందిన పవార్ లలితకు కొత్తబాది తండాకు చెందిన వ్యక్తితో 2010లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఏడాది కాలంగా భర్తతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో లలిత తల్లిగారింటికి వచ్చింది. ప్రస్తుతం డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద అద్దె ఇంట్లో నివసిస్తోంది. బుధవారం మధ్యాహ్నం నడిపల్లి చెరువులో పడి తీవ్రగాయాల పాలైంది. ఆమె వెంట ఉన్న వ్యక్తి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో లలిత హత్యకు గురైనట్లు తేలడంతో హత్య కేసుగా నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ..



ప్రవీణ్(ఫైల్)

భిక్కనూరు: పురుగుల మందు సేవించి ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని తిప్పాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగర్తి ప్రవీణ్(17) అనే విద్యార్థి ఇంటర్ వరకు చదివాడు. కాగా ఈ నెల 4న పురుగుల మందు తాగి కుటుంబీకులకు చెప్పలేదు. అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు మొదటగా స్థానిక ఆస్పత్రులు, రామాయం, హైద్రాబాద్ ఆస్పత్రుల్లో చూయించినా నయం కాలేదు. దీంతో కుటుంబీకులు గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. గురువారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయమై ఎస్సైను వివరణ కోరగా ఇప్పటి వరకు కుటుంబీకులు ఫిర్యాదు చేయలేదని అన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



విభాగాధిపతులతో మాట్లాడుతున్న తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): 2024–25 విద్యాసంవత్సరంలో సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరి సూచించారు. వేసవి సెలవుల అనంతరం యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలు గురువారం పునఃప్రారంభం కాగా, వర్సిటీలోని తన చాంబర్‌లో అన్ని విభాగాల అధిపతులతో రిజిస్ట్రార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయడంతో పాటు ఇంటర్నల్ మార్క్స్, ప్రాక్టికల్స్, థియరీ ఎగ్జామ్స్‌ను అల్మనాక్‌ను అనుసరించి నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో కంట్రోలర్ ఎం అరుణ, వివిధ విభాగాల అధిపతులు సీహెచ్ ఆంజనేయులు, మూసాఖురేషీ, డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ అడికే నాగరాజు, డాక్టర్ భ్రమరాంబిక, డాక్టర్ శాంతాబాయి, డాక్టర్ లక్ష్మణచక్రవర్తి, డాక్టర్ శిరీష, డాక్టర్ జమీల్ అహ్మద్, డాక్టర్ ఏ పున్నయ్య, డాక్టర్ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి అపహరణ కేసులో..

- మహిళకు ఏడాది జైలు శిక్ష

బోధన్: పది నెలల పాపను అపహరించిన కేసు లో మహిళకు ఏడాది జైలు శిక్ష, రూ. వంద జరిమాన విధిస్తూ బోధన్ కోర్టులో అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి దేవన్ అజయ్ కుమార్ తీర్పును గురువారం వెలువరించారు. జరిమా న కట్టకుంటే మరో 15 రోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పే ర్కొన్నారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ తెలిపిన ప్రకారం.. నిజామాబాద్ మండలంలోని కొత్తపేటకు చెందిన మేకల లక్ష్మి సాయిలు దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో తన పది నెలల పాపతో బోధన్ మండలంలోని చిన్నమావందికి వెళ్లి పుట్టింట్లో జీవిస్తోంది. పాపకు ఆరోగ్యం బాగలేనందున చికిత్స కోసం 2022 నవంబర్ 7న బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేసింది. చికిత్స అ నంతరం 9న రాత్రి ఆస్పత్రి సమీపంలోని మజీద్ దగ్గర పాపతో కలిసి నిద్రపోయింది. మరుస టి రోజు ఉదయం నిద్ర లేచి చూడగా కనిపించక పోయే సరికి పోలీసులకు ఫిర్యాదు చేసింది. టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేయ గా, ఎస్సై నవీన్ విచారణ చేపట్టారు. కేసులో చిన్నకుట్ల గంగామణి, అంజలి, షామీంబేగం, షహనాజ్‌ఫర్వీన్‌లను నిందితులుగా గుర్తించి చార్జీ షీట్ దాఖలు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో గురువారం చోరీ జరిగింది. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన గట్ల సజిత్ మరో కాలనీలో టైలర్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఉదయాన్నే ఇంటికి తాళం వేసి కుటుంబీకుల పనులకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం సజిత్ ఇంటికి వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్ టీం బృందాలను రప్పించి ఆధారాలు సేకరించారు. బీరువాలో ఉన్న 13 గ్రాముల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి, కొంత నగ దు చోరీకి గు రైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.